రాత్రి వేళల్లో భద్రత అవసరం



రాత్రి సమయంలో విధుల్లో ఉన్నప్పుడు మాకు పటిష్టమైన భద్రత కల్పించేందుకు ఎక్కువ మంది సెక్యూరిటీ సిబ్బందిని ఏర్పాటు చేయాలి. రాత్రి సమయంలో రోగులు, వారి బంధువుల నుంచి కూడా ఇబ్బంది లేకుండా సెక్యూరిటీ నిరంతరం పర్యవేక్షించాలి. **వార్డుల వైపు రౌండ్స్ వేస్తుండాలి.**

– పి.భవాని, స్టాఫ్ నర్స్, విమ్స్

కఠిన చట్టాలు తీసుకురావాలి



వైద్య వృత్తిలో 24 గంటలూ విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. ఇటువంటి రంగంలో పనిచేస్తున్న వారికి సరైన భద్రత ఎంతో అవసరం. ఆడ, మగ అని తేడా లేకుండా పనిచేస్తున్న మాకు ఎక్కువగా భద్రత కల్పించాలి. కోల్‌కతాలో చోటు చేసుకున్న ఘటనల్లాంటివి మళ్లీ జరగకుండా ఉండేందుకు, వైద్యులతో తప్పుగా ప్రవర్తించిన **వారిపై కఠిన చర్యలు తీసుకునేలా చట్టాలు** తీసుకురావాలి.

– డాక్టర్ యశోద, పాథాలజిస్ట్

విధుల్లో రక్షణ ఉండాలి



నైట్ షిఫ్ట్ విధులకు వెళ్లేటప్పుడు, సాయంత్రం వేళ విధులు ముగించుకుని వచ్చేటప్పుడు ఆస్పత్రి నుంచి ప్రధాన రహదారి వరకు భద్రత ఏర్పాటు చేయాలి. రాత్రి సమయంలో ఆస్పత్రుల నుంచి ప్రధాన జంక్షన్ వద్దకు రవాణా సౌకర్యం కల్పించాలి.

– వెంకటగిరి, స్టాఫ్ నర్స్, ఈఎన్‌టీ ఆస్పత్రి

చరిత్ర శిథిలం

- **ముడసర్లోవ పార్కులో పాడుబడిన ఏళ్లనాటి భవనాలు**
- **బ్రిటిష్ కాలంలో నిర్మాణం**
- విషసర్పాలు, పిచ్చిమొక్కలకు ఆవాసం
- సందర్శకుల్లో భయాందోళనలు



ముడసర్లోవ పార్కులో శిథిలమైన బ్రిటిష్ కాలం నాటి గెస్ట్ హౌస్

ఆరిలోవ: ఎంతో ఆహ్లాదకరమైన ముడసర్లోవ పార్కు శిథిల భవనాలకు నిలయంగా మారింది. నాడు ఈ పార్కులో సుందరంగా కనిపించిన భవనాలు.. నేడు అస్తవ్యస్తంగా మారాయి. ఒకప్పుడు అధికారులకు, అతిథులకు విశ్రాంతిని ఇచ్చేవి. ఇప్పుడు విషసర్పాలకు ఆవాసాలయ్యాయి. ఇక్కడ **ఉన్న భవనాలన్నీ శిథిలం కావడం విశేషం. దీంతో ఎప్పుడు అవి కూలిపోతాయో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. ముడసర్లోవ పార్కులో సర**దాగా కాసేపు గడుపుదామని వస్తున్న సందర్శకులు, స్థానికులకు ఇక్కడి శిథిల భవనాలు భయాందోళనలకు గురిచేస్తున్నాయి.

100 ఏళ్లకు పైమాటే..

ముడసర్లోవ పార్కులో బ్రిటిష్ కాలంలో నిర్మించిన భవనాలు ఉన్నాయి. అవి బయటకు చూడటానికి పాడుపడిన బూత్ బంగ్లా మాదిరిగా కనిపిస్తాయి. ఈ భవనాలను బ్రిటిష్ అధికారుల విశ్రాంతి కోసం నిర్మించారట. విశాఖకు వచ్చిన బ్రిటిష్ అధికారులు వీటిలో రోజుల తరబడి విశ్రాంతి తీసుకొనేవారట. వీటిని నిర్మించి సుమారు 100 ఏళ్లకు పైగా ఉంటాయని స్థానిక వృద్ధులు చెబుతున్నారు. వెడల్పయిన గోడలు, వాటిపై పెంకులతో కప్పు వేశారు. వీటికి కొన్నిచోట్ల పైకప్పు కూడా ఊడిపోయింది. లోపల గోడలు కూలిపోయాయి. ఖాళీగా వదిలేసిన బ్రిటిష్ విశ్రాంతి భవనంలో విషసర్పాలు చేరి ఆవాసం ఏర్పాటు చేసుకున్నాయి. లోపల పిచ్చి మొక్కలు దట్టంగా మొలిచాయి.

పంప్ హౌస్‌లుగా 'బ్రిటిష్' భవనాలు

వేరే ప్రత్యామ్నాయం లేకపోవడంతో బ్రిటిష్ కాలం నాటి రెండు భవనాలను జీవీఎంసీ నీటి సరఫరా విభాగం అధికారులు పంప్ హౌస్‌లుగా వినియోగిస్తున్నారు. దీని లోపల 20 హెచ్‌పీ, 60హెచ్‌పీ నీటిపైపులు, పంప్ హౌస్‌కు సంబంధించిన మోటార్లు అమర్చారు. ముడసర్లోవ రిజర్వాయర్ నుంచి గ్యాలరీలోకి వచ్చే నీరు శుద్ధి అయిన తర్వాత ఈ పంప్ హౌస్ ద్వారానే నూతిలో క్లోరినేషన్, ఆరిలోవ, రామకృష్ణాపురం, శ్రీకృష్ణాపురం సైడు నీటి సరఫరా చేయడం జరుగుతాయి. ఇక్కడి నుంచే ట్యాంకర్ల ద్వారా నీటిని కూడా సరఫరా చేస్తుంటారు. ఇవి పార్కులో ఉండటంతో సందర్శకులకు అస్తవ్యస్తంగా కనిపిస్తున్నాయి. మరో భవనం వినియోగించడానికి సైతం వీలులేని విధంగా శిథిలమైంది.



ముడసర్లోవ పార్కులో పంప్ హౌస్‌గా వినియోగిస్తున్న పాత భవనం

జీవీఎంసీ అతిథి గృహానిదీ అదే పరిస్థితి

ముడసర్లోవ పార్కులో 1991లో జీవీఎంసీ ఇక్కడ అతిథి గృహం నిర్మించింది. దీన్ని అప్పటి నగర మేయర్ డి.వి.సుబ్బారావు ప్రారంభించారు. నగరంలో ప్రముఖులు, నగరానికి వచ్చిన ముఖ్యులు ఈ అతిథి గృహంలోనే బస చేసేవారు. దీంతోపాటు ముఖ్యమైన నాయకులు అంతర్గత సమావేశాలు ఇందులోనే నిర్వహించేవారట. ఇదంతా ఒకప్పటి మాట. ఇప్పుడు ఈ భవనం అతిథులు ఉండడానికి వీలుపడదు. దీని లోపల అంతా శిథిలావస్థకు చేరడంతో ముడసర్లోవ నీటి సరఫరా విభాగం సిబ్బంది వారికి సంబంధించిన సామగ్రి, నీటి పైపులు వేసే గొడౌన్‌గా మార్చేశారు. ఇందులోకి విష సర్పాలు కూడా చేరిపోతున్నాయి.



శిథిలావస్థలో జీవీఎంసీ గెస్ట్ హౌస్

మూలకు చేరిన వాటర్ ఫౌంటెయిన్



పూర్తిగా పాడైన వాటర్ ఫౌంటెయిన్

ముడసర్లోవ పార్కు నిర్మించినప్పుడు సందర్శకుల కోసం ఏర్పాటు చేసిన వాటర్ ఫౌంటెయిన్ పూర్తిగా పాడైంది. దీనిలో పైకి విరజిమ్మే వాటర్ పైపులు విరిగిపోయాయి. దీని అడుగు భాగం శిథిలమైంది. ప్రస్తుతం ఇది మూలకు చేరింది.

ఏయూలో జాబ్‌మేళా నేడు

ఎంవీపీకాలనీ: ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ ఇన్‌ఫర్మేషన్ అండ్ గైడెన్స్ బ్యూరో, నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్(ఎన్‌సీఎస్) ఆధ్వర్యంలో శనివారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫ్లిప్‌కార్ట్, పేటీఎం, ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంక్, అపోలో ఫార్మసీస్ లిమిటెడ్ సంస్థల్లో ఉద్యోగాల భర్తీ కోసం జాబ్‌మేళా ఏర్పాటు చేశామన్నారు. ఏయూలోని సెంటర్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు జాబ్‌మేళా ప్రారంభమవుతుందని, ఆసక్తి గల అభ్యర్థులు హాజరు కావాలని కోరారు.

సీజనల్ వ్యాధులపై విస్తృత అవగాహన



మద్దిలపాలెం ఆరోగ్య కేంద్రంలో సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: మలేరియా, డెంగ్యూ వంటి సీజనల్ వ్యాధులపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆదేశించారు. మద్దిలపాలెం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీలు చేశారు. యూపీహెచ్‌సీ రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, ఇతర కార్యక్రమాలపై సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఎనీమియా మీద ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు, సూపర్‌వైజర్లు లబ్ధిదారులను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో నోడల్ అధికారి డాక్టర్ ఉమావతి, ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

దుర్గమ్మ నిత్యాన్నదానానికి రూ.2.02 లక్షల విరాళాలు



దాత తరఫు వారికి అమ్మవారి చిత్రపటం అందిస్తున్న ఏఈవో రమేష్‌బాబు

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి విశాఖపట్నానికి చెందిన భక్తులు శుక్రవారం విరాళాలు అందజేశారు. ఎంవీపీ కాలనీకి చెందిన పేరిచర్ల జానకీరామరాజు పేరిట రూ.1,01,116, పేరిచర్ల రూపవతి పేరిట రూ.1,01,116 విరాళాన్ని ఆలయ అధికారులకు అందించారు. అనంతరం దాత తరఫు వారికి ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం ఆలయ ఏఈవో ఎన్.రమేష్ బాబు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేష వస్త్రాలను బహూకరించారు.


తప్పిపోయిన బాలుడి అప్పగింత



అర్మాన్‌ను తల్లి నదియా, అన్న అన్వర్‌కు అప్పగిస్తున్న భీమిలి పోలీసులు

భీమునిపట్నం: ఇంటి నుంచి వెళ్లి తప్పిపోయిన బాలుడిని శుక్రవారం భీమిలి పోలీసులు అతడి తల్లికి అప్పగించారు. నగరంలోని ఆరిలోవకు చెందిన నదియాకు చెవిటి, మూగతో ఉన్న పదేళ్ల మహ్మద్ అర్మాన్ అనే కొడుకు ఉన్నాడు. ఈ బాలుడు శుక్రవారం ఉదయం నుంచి కనిపించడం లేదు. బీచ్‌ను చూడాలన్న కోరికతో భీమిలికి వచ్చాడు. తరువాత ఎటు వెళ్లాలో తెలియక బీచ్ రోడ్డులో తిరుగుతుండగా గమనించిన పోలీసులు స్టేషన్‌కు తీసుకొచ్చారు. బాలుడు తన వివరాలు చెప్పలేకపోవడంతో వీరు ఇతడి ఫొటోలను పలు వాట్సాప్ గ్రూపుల్లో పంపడంతో తల్లి నదియా చూసి బాలుడి అన్న అన్వర్‌తో కలిసి భీమిలి పోలీస్ స్టేషన్‌కు వచ్చింది. వారికి అర్మాన్‌ను ఎస్‌ఐ హరీష్ అప్పగించారు.

డిజిటల్ యుగంలో జాగరూకత అవసరం



మాట్లాడుతున్న పోర్టు డిప్యూటీ చైర్‌పర్సన్ దుర్గేష్‌కుమార్ దూబే

విశాఖ సిటీ: డిజిటల్ యుగంలో ఉద్యోగులు జాగరూకత, అవగాహన, భద్రతను పాటించడం అవసరమని విశాఖ పోర్టు అథారిటీ డిప్యూటీ చైర్‌పర్సన్ దుర్గేష్‌కుమార్ దూబే సూచించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు విజిలెన్స్ అవగాహన వారోత్సవాలలో భాగంగా శుక్రవారం పోర్ట్ పరిపాలన భవనంలోని సాంబమూర్తి ఆడిటోరియంలో సైబర్ సెక్యూరిటీపై అధికారులు, ఉద్యోగులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డిప్యూటీ చైర్మన్‌తో పాటు చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ పి.ఎల్.ఎల్.స్వామి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం సైబర్ మోసాలు, నేరాల నుంచి ఎలా తప్పించుకోవాలనే అంశాలను సైబర్ సెక్యూరిటీ నిపుణులు వివరించారు. రోజువారీ జీవితాలలో సైబర్ మోసాలు, నేరాల నుంచి తమను తాము రక్షించుకోవడానికి ఇవి ఉపయోగకరంగా ఉంటాయన్నారు.

ఏయూలో జాతీయ అంతరిక్ష దినోత్సవం

విశాఖ సిటీ: ఆంధ్రా యూనివర్సిటీ భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ అంతరిక్ష దినోత్సవం ఘనంగా నిర్వహించారు. చంద్రయాన్-3 మిషన్ విజయవంతమై ఏడాది పూర్తయిన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అంతరిక్ష సాంకేతికత, దాని అనువర్తనాల వైపు విద్యార్థులను ప్రోత్సహించడానికి క్విజ్, పెయింటింగ్, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పోస్టర్ ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి ఏయూ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రొఫెసర్ ఎం.వి.ఆర్.రాజు అంతరిక్ష శాస్త్రం, సాంకేతికతపై ఉత్సాహంగా ఉన్న విద్యార్థులను అభినందించారు. ఇస్రో చరిత్ర, దాని సామాజిక ప్రయోజనాలను వివరించారు. జియోఫిజిక్స్ మాజీ ప్రొఫెసర్ ఎ.నారాయణ స్వామి 'రివ్యూ ఆన్ ఇండియన్ స్పేస్ యాక్టివిటీ' అనే అంశంపై ప్రసంగించారు. భౌతిక శాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ ఎస్.శ్రీనివాసరావు దశాబ్దాలుగా విద్యా, పరిశోధన కార్యక్రమాలపై ఇస్రోతో ఆంధ్రా విశ్వవిద్యాలయం సంయుక్త సహకారాన్ని వివరించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ ఎం.వి.ఆర్.రాజు

ఈ–రిసోర్సెస్‌ను సద్వినియోగం చేసుకోండి

విశాఖ సిటీ: ఆంధ్రా యూనివర్సిటీ గ్రంథాలయంలోని ఈ–రిసోర్సెస్‌ను విద్యార్థులు, పరిశోధకులు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ఏయూ ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు సూచించారు. ఏయూ హెచ్‌ఆర్‌డీసీ కేంద్రంలో శుక్రవారం కె.నింబస్ డిజిటల్ లైబ్రరీపై అవగాహన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాంకేతిక ప్రగతి నేపథ్యంలో విస్తృతమైన జ్ఞానాన్ని పొందే సౌలభ్యం నేడు విద్యార్థులకు ఉందన్నారు. విద్యార్థులు ఉపయుక్తంగా ఈ–బుక్స్, ఈ–జర్నల్స్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. వీటిపై అవగాహన పెంచుకొని తమకు ఉపయుక్తంగా వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఆచార్య పి.వెంకటేశ్వర్లు, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ నరసింహారావు

ఆకట్టుకున్న ఆర్కిటెక్చర్ నమూనాలు

విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆర్కిటెక్చర్ విభాగం విద్యార్థులు తయారు చేసిన నమూనాలు ఆకట్టుకున్నాయి. తమ కోర్సులో భాగంగా ద్వితీయ సంవత్సరం విద్యార్థులు తమ సృజనాత్మకతతో ప్రజలకు ఉపయుక్తంగా నిలిచే బస్టాప్‌ల నమూనాలను తయారు చేశారు. వీటిని విభాగంలో ప్రదర్శించారు. వాటి నిర్మాణం, ప్లానింగ్, వినియోగించే మెటీరియల్స్, ఇతర ప్రత్యేకతలను విభాగ ఆచార్యులకు వివరించారు. విద్యార్థులు సృజనాత్మకతను ప్రొఫెసర్లు ప్రశంసించారు.



తయారు చేసిన నమూనాలతో విద్యార్థినులు

బడ్డీ తొలగించాలని నిరసన

సీతమ్మధార: చినవాల్తేరు కొటక్ స్కూల్ తోపుడు బండ్ల సెంటర్‌లో ఏర్పాటు చేసిన కొత్త బడ్డీని వెంటనే తొలిగించాలని తోపుడు బళ్ల సంఘం ఆధ్వర్యంలో ఆశీలమెట్ట దరి జీవీఎంసీ జోన్-3 కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా ఈ సెంటర్‌లో తోపుడు బళ్ల వ్యాపారం చేసుకుంటూ 23 కుటుంబాల వారు జీవిస్తున్నారని అన్నారు. ఆగస్టు 15వ తేదీన కొత్తగా ఈ సెంటర్లో బడ్డీ ఏర్పాటు చేశారని, దానిని వెంటనే తొలిగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పి.వెంకటరావు, ఎ.అప్పారావు, కె.కుమారి తదితరులు పాల్గొన్నారు.



జోన్-3 కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న తోపుడుబళ్ల సంఘం నాయకులు

పాఠశాలల్లో ఫిర్యాదుల పెట్టెలు ఏర్పాటు చేయాలి

- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు సీతారాం

విశాఖ విద్య: జాతీయ, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాలు, సూచనలను అనుసరించి పాఠశాలల్లో ఫిర్యాదుల పెట్టెలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం అన్నారు. శుక్రవారం ఆరిలోవ సెయింట్ ఆన్స్ పాఠశాలలో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్, జిల్లా విద్యాశాఖల సమన్వయంతో 'బాలల హక్కుల పరిరక్షణలో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు, వార్డు సచివాలయం కార్యదర్శులు పాత్ర'పై అవగాహన సదస్సు నిర్వహించారు. చినగదిలి మండల విద్యాశాఖాధికారి ఎం.రవీంద్ర అధ్యక్షత వహించగా జిల్లా గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి డాక్టర్ ఖలీషా బేగం సమన్వయకర్తగా వ్యవహరించారు.



మాట్లాడుతున్న గొండు సీతారాం

ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ జిల్లా విద్యా శాఖ సమన్వయంతో పనిచేసి విద్యార్థినుల భద్రతకు కృషి చేయాలన్నారు. బాలలపై లైంగిక దాడులు, మంచి, చెడు స్పర్శలు, ఆడపిల్లల రుతుస్రావ సమయంలో ఆరోగ్య జాగ్రత్తలు, బాలల హక్కులు, మాదక ద్రవ్యాల నియంత్రణ వంటి వాటిపై అవగాహన కల్పించాలన్నారు. వీటిపై విద్యార్థులు స్వేచ్ఛగా తమ ఇబ్బందులను తెలియజేసేందుకు ప్రతీ పాఠశాల ప్రాంగణాల్లో ఫిర్యాదుల పెట్టెలు ఏర్పాటు చేయాలన్నారు. సీనియర్ సైకాలజిస్టులు పార్వతి కాశ్యప్, గాయత్రి మెడికల్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ సుభాష్ మాట్లాడుతూ ఇటువంటి అవగాహన కార్యక్రమాలు.. పిల్లలకు మేలుకలిగే ఎన్నో విషయాలు ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల ద్వారా చేరవేసేందుకు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల అసోసియేషన్ (అపుస్మా) రాష్ట్ర ట్రెజరర్ ఎం.వి.రావు, జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యురాలు లక్ష్మి, సర్వశిక్షా అభియాన్ పీడీ బి.శ్రీనివాసరావు, మండల విద్యాశాఖాధికారి-2 అనురాధ, అర్బన్ చైల్డ్ డెవలప్‌మెంట్ పీడీ శ్రీలత, జిల్లా బాలల సంరక్షణ విభాగం సిబ్బంది బి.శకుంతల, ఆనంద్, శారద, కార్మిక శాఖ అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఎం.విజయ, సెయింట్ ఆన్స్ పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ సుమతి పాల్గొన్నారు.

సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మించాలి

మద్దిలపాలెం: పారిశ్రామిక ప్రాంతంలో వరుసగా ప్రమాదాలు జరగడం బాధాకరమని రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ మూలా వెంకటరావు ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదాల్లో మృతుల సంఖ్య పెరగకుండా గాయపడిన వారికి తక్షణం వైద్యం అందించేలా పారిశ్రామిక వాడలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మించాలని డిమాండ్ చేశారు. అచ్యుతాపురంలో సంభవించిన ప్రమాదం తీవ్రమైనదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే శాశ్వత చర్యలు తీసుకోవాలని, రక్షణ చర్యలపై పర్యవేక్షణ కట్టుదిట్టం చేయాలని సూచించారు. పరిశ్రమల భద్రతకు మరిన్ని నిధులు కేటాయించాలన్నారు.

ప్రమాదాల నియంత్రణపై అప్రమత్తం

ఎంవీపీకాలనీ: ప్రమాదాల నియంత్రణపై హాస్పిటళ్ల యంత్రాంగాలు అప్రమత్తంగా ఉండాలని ఏపీ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అండ్ ఫైర్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్ మాదిరెడ్డి ప్రతాప్ సూచించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్, ఏపీఎన్‌ఏ ఆధ్వర్యంలో నగరంలోని ఇండస్ హాస్పిటల్ సెమినార్ హాల్‌లో ఫైర్ సేఫ్టీ సమస్యలపై శుక్రవారం నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. అగ్నిప్రమాదాలతోపాటు ఇతర ప్రమాదాల నియంత్రణకు అవసరమైన నిబంధనలు పాటించడంతోపాటు ఎప్పటికప్పుడు మాక్ డ్రిల్స్ నిర్వహించడం, సాంకేతిక అప్రమత్తతను పరిశీలించుకోవడం చేయాలన్నారు. ఈ సందర్భంగా మాదిరెడ్డి ప్రతాప్‌ను ఐఎంఏ ఆధ్వర్యంలో సత్కరించారు.



మాదిరెడ్డి ప్రతాప్‌ను సత్కరిస్తున్న ఐఎంఏ ప్రతినిధులు

కార్యక్రమంలో ఐఎంఏ విశాఖ అధ్యక్షుడు డాక్టర్ పి.జె.శ్రీనివాస్, కోశాధికారి మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక

ఎంవీపీకాలనీ: రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను బీజేపీ నగర నాయకులు కలిసి సత్కరించారు. మన్యం జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం నగరానికి వచ్చిన ఆయనను ఓ హోటల్‌లో మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఆరోగ్య శాఖ ద్వారా ప్రజలకు విశిష్టమైన సేవలు అందించి రాష్ట్రంలో బీజేపీ ఖ్యాతిని పెంచాలని నాయకులు కోరారు. బీజేపీ విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, మన్యం జిల్లా ఇన్‌చార్జి ఎస్.వి.ఎస్.ప్రకాష్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రోటోకాల్ కన్వీనర్ బాల రాజేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి దామోదర్ మాదవ్ పాల్గొన్నారు.



మంత్రి సత్యకుమార్‌ను సత్కరిస్తున్న బీజేపీ నాయకులు

విజేతలకు బహుమతుల ప్రదానం

మహారాణిపేట : జిల్లా స్థాయిలో 8, 9 తరగతి విద్యార్థులకు నిర్వహించిన క్విజ్ పోటీల విజేతలకు శుక్రవారం రేసవానిపాలెంలో ఉన్న జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, క్షయ నివారణ కార్యాలయంలో డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు బహుమతులు అందజేశారు. యూత్ ఫెస్ట్ కార్యక్రమంలో భాగంగా 18 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఈ పోటీలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో ప్రథమ బహుమతి కింద రూ.5 వేలు (నడుపూరు, జెడ్పీ హైస్కూల్), ద్వితీయ బహుమతి రూ. 4 వేలు (నరవ జెడ్పీ హైస్కూల్), తృతీయ బహుమతి రూ. 3 వేలు (ఇస్లాంపేట జెడ్పీ హైస్కూల్) అందజేశారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జగదీశ్వరరావు నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, క్షయ నివారణ అధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు, క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ ఉమామహేశ్వరరావు, జిల్లా సూపర్‌వైజర్ భద్రి, సైన్సు ఆఫీసర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

నేడు మధురవాడకు అయోధ్య శ్రీరామ ధనుస్సు

మధురవాడ: జీవీఎంసీ 8వ వార్డు మధురవాడ బాలాజీ హిల్స్‌పై ఉన్న వేంకటేశ్వర స్వామి సన్నిధికి శనివారం సాయంత్రం 5 గంటలకు అయోధ్య రామాలయంలో ప్రతిష్ఠించనున్న వెండి ధనస్సు వస్తుందని ఆలయ కమిటీ కార్యదర్శి మగ్గూరి వెంకటరావు తెలిపారు. దేశమంతటా తిరుగుతూ అందులో భాగంగా ఇక్కడి భక్తుల దర్శనం కోసం ధనుస్సు ఉంచుతామని చెప్పారు. భక్తులకు స్వయంగా కోదండాన్ని స్పర్శ దర్శనం చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. భక్తులంతా పాల్గొని రాముల వారి కృపకు పాత్రులు కావాలని వెంకటరావు కోరారు.

